

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 18 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో సోమవారం టమాట కిలో ధర గరిష్ఠంగా రూ.10 పలికింది. కనిష్ఠం రూ.3.50, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.7°/22.1°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గాలివేగం పెరిగింది.

న్యూస్‌రీల్

91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



కొట్లపల్లిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నరేష్

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి 'వైఎస్సార్ పింఛన్ కానుక' అందించడంతో రెండో రోజు సోమవారం నాటికి జిల్లాలో 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలోని 32 మండలాల పరిధిలోని 2,73,975 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.76,13,01,750 మంజూరు చేసింది. ఈ క్రమంలో వలంటీర్లు రెండు రోజుల్లోనే 2,46,873 మందికి రూ. 68,57,75,500 నగదు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. పింఛన్ పంపిణీకి మరోమూడు రోజుల గడువు ఉందని, తప్పనిసరిగా వందశాతం పంపిణీ పూర్తి చేస్తామన్నారు.

క్రీడా అకాడమీకి రేపు ఎంపికలు

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో (బాస్కెట్‌బాల్, బాడ్మింటన్, హాకీ, టెన్నిస్, వాలీబాల్) ప్రవేశాలకు ఈనెల 4న ధర్మవరంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కోచ్ ఉదయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా అకాడమీలో ప్రవేశాలకు 12 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సున్న బాలురు అర్హులన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణపత్రం, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 9849421462 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

గాంధీ బాటలో పయనిద్దాం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ కొండయ్య తదితరులు

పుట్టపర్తి అర్బన్: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం సాధించిపెట్టిన మహాత్మాగాంధీ బాటలో అందరం పయనిద్దామని డీఆర్‌ఓ కొండయ్య పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జయంతి వేడుకలు సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ... స్వాతంత్య్ర సంగ్రామంలో పలు మార్లు జైలు జీవితం గడిపిన గాంధీ ఉద్యమ బాట మాత్రం వీడలేదన్నారు. ఆయన బాట, మాట మనకు శిరోధార్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మద్దతు లేని దీక్షలు!

'స్కిల్ స్కాం కేసులో ఆయన (చంద్రబాబు)కు సంబంధం లేకపోతే కోర్టు ఎందుకు బెయిల్ ఇవ్వదు?..అంటే ఆయన పాత్ర ఉందనే కదా! దీనిపై మనం ఎందుకు దీక్షలు చేయాలి? నేరం చేసిన వారికి మద్దతు తెలిపితే జనం మనల్ని ఏమనుకుంటారు..? ఇప్పుడే ఉనికి కోల్పోయాం. ఇలాంటివి చేస్తే జనం కాలర్ పట్టుకుంటారు. నేనైతే రాలేను'

– చంద్రబాబుకు మద్దతుగా దీక్షల్లో పాల్గొనాలని కోరిన టీడీపీ నాయకుడితో మండలస్థాయి నేత మాటలివి.

'ఇన్నాళ్లూ మమ్మల్ని ఎవరు పట్టించుకున్నారు? ఇప్పుడు ఆయనకేదో అయ్యిందని మమ్మల్ని రోడ్డెక్కమంటారా..? ఇది న్యాయంగా ఉందా? సంపాదించుకున్నన్నాళ్లూ మేము కనిపించలేదు. జైల్లో పడ్డాక మా అవసరం వచ్చిందా...మమ్మల్ని పట్టించుకోని వారికోసం మేమెందుకు రోడ్డెక్కాలి..?'

– టీడీపీ నాయకుడితో కార్యకర్త అన్న మాటలివి.

- టీడీపీ నిరసనలకు ప్రజా స్పందన కరువు
- నేతల దీక్షలవైపు కన్నెత్తి చూడని కార్యకర్తలు
- బాబు పాపం పండిందంటున్న ప్రజలు
- అవినీతిని సమర్థించేది లేదంటున్న సామాన్య జనం



కదిరి: 'స్కిల్' స్కాంలో అరెస్టయి రిమాండ్ ఖైదీగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు కొన్ని రోజులుగా చేపడుతున్న వివిధ రకాల నిరసన దీక్షలకు ప్రజల నుంచి కాదు కదా కార్యకర్తల నుంచి కూడా స్పందన కన్పించడం లేదు. ఆయన జైలుకెళ్లి 23 రోజులు గడుస్తున్నా జిల్లాలో ఎక్కడా పెద్దగా చర్చ లేదు. ఆయన జైలుకెళ్లాక మేం గుర్తొచ్చామా అని కార్యకర్తలు ప్రశ్నిస్తుండగా... బాబు పాపం పండి జైలుకెళ్లాడని జనం అనుకుంటున్నారు. శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ప్రజలంతా తమ ఇళ్ల నుండి బయటకొచ్చి పళ్లాలు(భోజనం ప్లేట్స్)మోగించాలని టీడీపీ పిలుపునిచ్చినా... ప్రజలెవ్వరూ పట్టించుకోలేదు. పైగా టీడీపీ నాయకుల తీరును చూసి చంద్రబాబు అవినీతిని మీరు సమర్థిస్తున్నారా అని సామాన్య జనం బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు.

కన్నెత్తి చూడని కార్యకర్తలు

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినా ఒక్క బస్సు కూడా ఆగలేదు. జిల్లాలో ఎక్కడా ఒక్క దుకాణం మూత పడలేదు. టీడీపీ కేడర్ నుంచి సైతం సరైన స్పందన రాలేదు. దీంతోనే నాయకులు, కార్యకర్తలందరూ బయటకు వచ్చి ఆందోళనలు చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కోపంతో ఓ ఆడియో విడుదల చేసినా కార్యకర్తలు పెద్దగా పట్టించుకోలేదు. 'ఆయనకేం బాగానే చెబుతాడు... చంద్రబాబుకు మద్దతుగా రోడ్డెక్కితే జనమే తన్నేలా ఉన్నారు' అంటూ కార్యకర్తలు టీడీపీ నేతల నిరసనల వైపు కన్నెత్తి చూడలేదు. ఫలితంగా చంద్రబాబుకు జనమే కాదు కార్యకర్తలు కూడా మద్దతు పలకడం లేదన్న విషయం తెలుస్తోంది.

ప్రజల నుంచీ స్పందన కరువు

వరుస అవినీతి కేసులతో చంద్రబాబు బండారం బయట పడుతోంది. న్యాయస్థానాల్లో సైతం కోట్లు ఖర్చు చేసి తీసుకొచ్చిన బాబు తరపు న్యాయవాదులు చేస్తున్న వాదనలు వీగిపోతున్నాయి. దీంతో ప్రజలకు వాస్తవాలు తెలిసిపోతున్నాయి. అందుకే ప్రజల నుంచి దీక్షలు, నిరసనలకు స్పందన రావడం లేదని టీడీపీ నాయకులే కొందరంటున్నారు. జనం నుండి ఎలాంటి మద్దతు లేక పోయినా పార్టీ ఆదేశాల మేరకు ఏదో ఒక కార్యక్రమం చేయక తప్పలేదని వారంటున్నారు.

విహారయాత్రలో టీడీపీ కౌన్సిలర్లు



కేరళ టూర్‌లో ఉన్న టీడీపీ కౌన్సిలర్ల గ్రూప్ ఫొటో

తాడిపత్రి అర్బన్: టీడీపీ చంద్రబాబు 'స్కిల్' స్కాంలో రిమాండ్ ఖైదీగా జైలుకెళ్లారు. అరెస్టును వ్యతిరేకిస్తూ గాంధీ జయంతి రోజున 'సత్యమేవ జయతే' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని టీడీపీ అధిష్టానం పిలుపునిచ్చింది. అయితే టీడీపీ కార్యకర్తల నుంచి కానీ, ప్రజల నుంచి కానీ పెద్దగా స్పందనా కనిపించలేదు. తాడిపత్రిలో ఈ విషయం ప్రస్ఫుటమైంది. చంద్రబాబుకు మద్దతుగా ఆందోళనలు చేస్తే ప్రజల్లో మనం కూడా మరింత చులకన అవుతామని టీడీపీ నాయకులు భావించినట్లు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సహచర కౌన్సిలర్లను విహారయాత్ర కోసం కేరళకు పంపించారు. వారంతా కుటుంబ సభ్యులతో విహారయాత్ర చేస్తుండగా, ప్రభాకర్‌రెడ్డి మాత్రం అనుచరులతో కలిసి కాసేపు దీక్ష చేపట్టి 'మమ' అనిపించారు.

బాబు 13 చోట్ల సంతకం చేశారు



కేబినెట్ అనుమతి లేకుండానే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. విధి విధానాలు సైతం పాటించలేదు. ప్రైవేటు వ్యక్తి గంటా సుబ్బారావుకు ఇందులో మూడు బాధ్యతలు అప్పగించారు. చంద్రబాబు 13 చోట్ల ఈ జీఓల్లో సంతకాలు చేశారని సీఐడీ అధికారి చెప్పారు కదా..? తప్పు చేశాడు కాబట్టే బాబు జైలుకెళ్లాడు. ఈ విషయం ప్రజలు అర్థం చేసుకున్నారు కాబట్టే టీడీపీ నాయకుల దీక్షలవైపు కన్నెత్తి చూడటం లేదు.

–డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి, ఏపీపీఎస్సీ మెంబర్, కదిరి

అప్పుడేమయ్యారు ఈ ఇద్దరూ?



బ్రాహ్మణి, భువనేశ్వరి... ఇద్దరూ ఇన్నాళ్లకు ప్రజల మధ్యకొచ్చారు. పుష్కరఘాట్‌లో బాబు కుటుంబం స్నానానికి వెళ్లినప్పుడు 30 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇరుకు సందుల్లో మీటింగ్‌లు పెట్టి మరికొందరని బలితీసుకున్నారు. బషీర్‌బాగ్ కాల్పుల్లో ఎంతోమంది చనిపోయారు..అప్పుడేమయ్యారు ఈ భువనేశ్వరి, బ్రాహ్మణి?. అంటే పేదల ప్రాణాలు మీకు లెక్కలేదా? మీ ఇంట్లో వారికి కష్టమొస్తేనే బయటకొస్తారా?

–ఫర్హానా ఫయాజ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, కదిరి

బాబు ఎప్పుడో జైలుకెళ్లాలి



చంద్రబాబు ఎన్నో కేసుల్లో నిందితుడు. ఆయన కోర్టుల్లో స్టేలు తెచ్చుకోకపోతే ఎప్పుడో జైలుకెళ్లేవాడు. ఇన్నాళ్లకు ఆయన పాపం పండి జైలులో రోజులు గడుపుతున్నాడు. ఆయన పేదల రక్తాన్ని తాగితే... జైల్లో ఆయన రక్తాన్ని ఇప్పుడు దోమలు తాగుతున్నాయి. నందమూరి తారక రామారావును ఆయన పెట్టిన క్షోభ జనానికి ఇప్పటికీ గుర్తుంది.

–కొమ్మెద్ది అప్పుల్ల, దళిత నాయకుడు

ఆదాయం పెంపునకు కృషి చేయండి



పుట్టపర్తి డిపోలో సిబ్బందితో మాట్లాడుతున్న ఈడీ వెంకటేశ్వర్లు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పనిచేసి ఆదాయం పెంపునకు కృషి చేయాలని కడప జోన్ కార్యనిర్వాహక సంచాలకులు(ఈడీ) వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆయన జిల్లా పర్యటనలో భాగంగా పుట్టపర్తి డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలు పరిశీలించి సూచనలు చేశారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం డీపీటీఓ కార్యాలయంలో అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశమై ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికుల సంరక్షణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ... ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సకాలంలో బస్సులు నడపాలన్నారు. ప్రయాణికుల సంఖ్య పెంచేందుకు రూట్‌లలో గిఫ్టులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి డిపోలో ఖర్చు, ఆదాయం పరిశీలించుకోవాలన్నారు. కేఎంపీఎల్ పెంచి ఖర్చు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో డీపీటీఓ మధుసూదన్, సూపర్‌వైజర్లు ఖాజావలి, షాషావలి, డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న, ఎంఎఫ్ విజయానంద్‌తో పాటు సెక్యూరిటీ సిబ్బంది, అన్ని అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ

అనంతపురం: సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ (మల్టీడే) మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు కడపలో నిర్వహించనున్నారు. ఇందులో ప్రాతినిధ్యం వహించే అనంతపురం జిల్లా అండర్–23 జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఎంకే దత్తారెడ్డి, పి.అర్జున్ టెండూల్కర్, బి.యోగానంద, టి.మహేంద్రరెడ్డి, డి.ఖాదర్‌వలి, చైత్ర వర్ధన్, కేఎస్ రోహిత్ రోషన్, ఎస్ఎండీ కామిల్, ఎం.దీపక్, టి.ప్రదీప్‌రెడ్డి, సంతోష్, ఎస్.రేవంత్‌రెడ్డి, డి.తన్వీర్ జమాల్, ఎ.జయంత్ కృష్ణ, జి.మల్లికార్జున, లోహిత్ సాయి కిషోర్ ఎంపికైన వారిలో ఉన్నారు.

ఎన్ఐఏ సోదాల కలకలం

- మావోయిస్టు సానుభూతిపరుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు
- అనంతలో టీచర్ శ్రీరాములు ఇంట్లో తనిఖీలు
- 6న విచారణకు హాజరుకావాలని నోటీసు అందజేత
- కుటాగుళ్లకు చెందిన చంద్రను అదుపులోకి తీసుకుని బెంగళూరుకు తరలించిన ఎన్ఐఏ బృందం

అనంతపురం క్రైం/యాడికి/కదిరి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమవారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు సోదాలు నిర్వహించారు. అనంతపురంలోని కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు, శింగనమల మండలం సలకం చెరువు జెడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పని చేస్తున్న ఎరుకుల శ్రీరాములు, యాడికి మండలం పుప్పాల గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ వెంకటనరసయ్య ఇంట్లో తనిఖీలు చేశారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో మావోయిస్టు సానుభూతి పరులైన పలువురి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తెల్లవారు జామున నాలుగు గంటలకు బెంగళూరు నుంచి అనంతపురానికి ప్రత్యేక వాహనంలో చేరుకున్న ఎన్ఐఏ బృందం స్థానిక పోలీసుల సహకారంతో బిందెల కాలనీకి చేరుకుంది. ప్రత్యేక పోలీసు బలగాలు శ్రీరాములు ఇంటిని ఆధీనంలోకి తీసుకోగా ..ఎన్ఐఏ అధికారులు గంటల తరబడి సోదాలు జరిపారు. మధ్యాహ్నం రెండు గంటల దాకా సోదాలు కొనసాగాయి. మావోయిస్టు కార్యకలాపాలతో సంబంధాలు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. శ్రీరాములుకు చెందిన సెల్‌ఫోన్, కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో ముద్రించిన కరపత్రాలు కూడా అందులో ఉన్నట్లు సమాచారం. అలాగే ఈ నెల 6న హైదరాబాదులోని ఎన్ఐఏ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసు అందజేశారు.

- యాడికి మండలం పుప్పాల గ్రామానికి చెందిన వెంకటనరసయ్య ఇంట్లో సోమవారం ఎన్ఐఏ అధికారులు సోదాలు చేసి, పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. వెంకటనరసయ్య 2005–06 మధ్యకాలంలో నక్సలైటుగా పనిచేశారు. పలు కేసుల్లో జైలు జీవితం గడిపారు. భార్య 15 ఏళ్ల క్రితమే చనిపోగా, కుమారుడు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత వెంకటనరసయ్య కొన్నాళ్లు ఒంగోలులో ప్రజా కళా మండలి సభ్యుడిగా పని చేశారు. తర్వాత స్వగ్రామానికి చేరుకున్నారు.
- కదిరి మునిసిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో దివంగత మావోయిస్ట్ నేత రవూఫ్ శిష్యుడైన రామక్కగారి చంద్ర ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. పిస్టల్‌తో పాటు 14 బుల్లెట్లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని తమ వాహనంలో బెంగళూరు తీసుకెళ్లారు.



చంద్రను ఇంట్లో సోదాల అనంతరం తిరిగి వెళ్తున్న ఎన్ఐఏ అధికారులు



గీతాలు ఆలపిస్తున్న మహిళా భక్తులు

సాయిగానం.. ముక్తిమార్గం

పుట్టపర్తి అర్బన్: భక్తుల సత్యసాయి స్మరణతో ప్రశాంతి నిలయం ప్రతిధ్వనించింది. పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయం విచ్చేసిన పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సత్యసాయి సోమవారం సత్యసాయిని కీర్తిస్తూ చేసిన సంగీత విభావరి అందరినీ అలరించింది. 'ఏకదంతాయ వక్రతుండాయ గణేశాయ ధీమహి' అంటూ కచేరీ ప్రారంభించారు. అనంతరం 'సత్యం శివం సుందరం, నీ నామ స్మరణం మాకు అద్భుత చరిత ఆనంద రసభరిత' అంటూ సుమారు రెండు గంటల పాటు సత్యసాయిని కీర్తిస్తూ గీతాలు ఆలపిస్తూ అందరినీ ఆధ్యాత్మిక సాగరంలోకి తీసుకెళ్లారు. సత్యసాయి చూపిన బాటే ముక్తిమార్గమని చాటారు. అంతకుముందు భక్తులు ఉదయం చిత్రావతి ఘాట్‌లో పూజలు నిర్వహించారు. సంగీత విభావరి నిర్వహించిన భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జ్ఞాపికలు, సత్యసాయి బాబా చిత్రపటాలు, నూతన వస్త్రాలను అందజేశారు.



నూతన వస్త్రాలు అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్

ప్రకృతి సేద్యమే ఆమోదయోగ్యం

- రైతులంతా పెట్టుబడి తగ్గించుకోవడంపై దృష్టిసారించాలి
- రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేలా చర్యలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి రొళ్ల, మడకశిర మండలాల్లో పర్యటన
- ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన పంటల పరిశీలన



నీలకంఠాపురంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు

మడకశిర రూరల్/రొళ్ల: పర్యావరణాన్ని కాపాడటంతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్నిచ్చే ప్రకృతి వ్యవసాయం ఇప్పుడు అందరికీ ఆమోదయోగ్యమైందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే తిప్పేస్వామి, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్, జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి తదితరులతో కలిసి రొళ్ల, మడకశిర మండలాల్లో పర్యటించారు. తొలుత రొళ్ల మండలం ఎస్సీ కాలనీకి చెందిన రైతులు నాగరాజు, హనుమంతరాయ, కరియమ్మ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆర్.వద్రహట్టి గ్రామ సమీపాన ఏడు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కంది, అలసంద, ఆముదం, గోరు చిక్కుడు, అనప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.ఎస్.జవహర్‌రెడ్డి మాట్లాడుతూ...సాగునీరు తక్కువ లభ్యమయ్యే బంజరు భూముల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో రైతులు అధిక దిగుబడి సాధించడం అభినందనీయన్నారు. ఇందుకు కృషి చేస్తున్న రైతు సాధికార సంస్థ చర్యలు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన పంటల తిన్నవారికీ సంపూర్ణ ఆరోగ్యం దక్కుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో బంజరు భూముల అభివృద్ధికి ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహద పడుతోందన్నారు.

ప్రకృతి సేద్యంతో భూమి సారవంతం

అనంతరం జవహర్‌రెడ్డి మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామంలో పర్యటించారు. రైతులు మోహన్‌దాస్, అనితాలక్ష్మి ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన వివిధ రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి రైతులతో మాట్లాడి ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు, పెట్టుబడి, లాభాలు తదితర వాటి గురించి తెలుసుకున్నారు. ప్రకృతి సేద్యం వల్ల భూమి సారవంతం అవుతుందని, తద్వారా తక్కువ ఖర్చుతో పంటలను సాగు చేసి మంచి దిగుబడి పొందవచ్చన్నారు. అనంతరం ప్రకృతి సేద్యంలో భాగంగా రైతులు తయారు చేసే ఘన, ద్రవ జీవామృతం తయారీని జవహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు మోహన్‌దాస్ పొలంలో 26 రకాల విత్తనాల మోడల్ సాగును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పార్వతి మహిళా సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ప్రకృతి సేద్యంలో మహిళల పాత్ర, సంఘాల పనితీరు, నిర్వహణ, బాల్యవివాహాల నిర్మూలన గురించి మాట్లాడారు. ఇంటి ఆవరణంలో, పొలంలో కూరగాయాల సాగుతో వారానికి రూ.2 వేల వరకూ ఆదాయం పొందుతున్నామని మహిళలు తెలపడంతో వారిని అభినందించారు.



నీలకంఠాపురంలో మహిళా సంఘం సభ్యులతో మాట్లాడుతున్న జవహర్‌రెడ్డి తదితరులు

వందశాతం ప్రకృతి సేద్యం చేస్తే మళ్లీవస్తా

నీలకంఠాపురం రైతులు వంద శాతం ప్రకృతి సేద్యం సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తే మళ్లీ ఇక్కడకు వస్తానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే ఆడపిల్లలకు వివాహాలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మూల సూత్రాలను అర్థం చేసుకుంటే వ్యవసాయంలో నష్టాలు రావన్నారు. ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు సాధించిన రైతులు దేశానికి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. మహిళలు కూడా సులభంగా వ్యవసాయం చేసి లాభాలు పొందాలన్నారు.

మడకశిర డివిజన్‌లో 32 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు

మడకశిర వ్యవసాయశాఖ డివిజన్‌లోని 134 గ్రామాల్లో 16,600 మంది రైతులు 32 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి తెలిపారు. వీరంతా ద్వారా వివిధ రకాల పంటలను సాగు చేసి ఆదాయం పొందుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల దిగుబడులు పెరగడంతో పాటు ఆదాయం ఎక్కువగా ఉండటంతో మిగతా రైతులూ ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారని, దీంతో మడకశిర డివిజన్‌లో ప్రకృతి సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, తహసీల్దార్ ముర్షావలి, వైఎస్సార్ క్రాంతి పథం పీడీ నరసయ్య, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, ఎంపీపీ కవిత, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు ఆనంతరాజు, ఏడీఏ కృష్ణమీనన్, డీపీఓ విజయకుమార్, డీఎల్‌పీఓ శివారెడ్డి, రొళ్ల తహసీల్దార్ హసీనాసుల్తానా, వివిధ శాఖల అధికారులు, కోఆర్డినేటర్ రమేష్, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం



నేను 2019 నుంచి నా భార్య సహకారంతో రెండు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నా. ఏడాదికి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం పొందుతున్నా. ప్రకృతి సేద్యం వల్ల పెట్టుబడి తక్కువగా ఉండటంతో పాటు మంచి దిగుబడులు వస్తున్నాయి. అందువల్లే ఏటా ఆదాయం పొందుతున్నా. నన్ను చూసి మిగతా రైతులూ ప్రకృతి సేద్యం చేస్తున్నారు.

– మోహన్‌దాస్, రైతు, నీలకంఠాపురం, మడకశిర మండలం

మడకశిర పారిశ్రామికవాడకు మహర్దశ

- నిరుద్యోగులకు స్థానికంగానే ఉపాధి
- రూ.250 కోట్లతో ఏర్పాటుకానున్న స్టీల్ ఫ్యాక్టరీ
- రూ.14కోట్లతో మరో రెండు ప్లాస్టిక్ ఫ్యాక్టరీల ఏర్పాటు


మడకశిర పారిశ్రామికవాడకు సేకరించిన భూములివే

మడకశిర పారిశ్రామికవాడకు సేకరించిన భూమి **1,600 ఎకరాలు**

మూడు పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించిన భూమి **58 ఎకరాలు**

మూడు పరిశ్రమల మొత్తం పెట్టుబడి **రూ.264 కోట్లు**

ఉపాధి పొందే నిరుద్యోగుల సంఖ్య **1,050**

మడకశిర: జిల్లాలోని మడకశిర పారిశ్రామిక వాడకు మంచి రోజులు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు పలువురు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారు. త్వరలో మూడు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశారు.

వైఎస్సార్ హయాంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు

మడకశిర పారిశ్రామిక వాడకు దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే బీజం పడింది. మడకశిర మండలం ఆర్.అనంతపురం వద్ద పారిశ్రామికవాడ ఏర్పాటుకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మొత్తం 1,600 ఎకరాలను కేటాయించారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం పారిశ్రామిక వాడ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో పరిశ్రమల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాలేదు. తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మడకశిర పారిశ్రామిక వాడకు మహర్దశ చేకూరింది. పారిశ్రామికవాడ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులందరికీ పూర్తి స్థాయిలో సీఎం వైఎస్ జగన్ పరిహారం చెల్లించి, పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగించారు. ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి చొరవతో పలుమార్లు ఏపీఐఐసీ అధికారులు, పారిశ్రామిక వేత్తలు సమావేశమై చర్చించారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు ప్రభుత్వం తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ ఎమ్మెల్యే తిప్పేస్వామి భరోసానిచ్చారు.

మూడు పరిశ్రమల స్థాపనకు 58 ఎకరాలు కేటాయింపు:

మడకశిర పారిశ్రామికవాడలో వివిధ పరిశ్రమల స్థాపనకు ఏపీఐఐసీ(ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) 58 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో 48 ఎకరాల్లో రూ.250 కోట్లతో ఏర్పాటు కానున్న స్టీల్ ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా 650 మంది నిరుద్యోగులకు, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. అలాగే మరో 10 ఎకరాల్లో మొత్తం రూ.14 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న రెండు ప్లాస్టిక్ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా 200 మందికి, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి దక్కనుంది. ఈ నేపథ్యంలో పరిశ్రమల నిర్మాణ పనులకు త్వరలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు ఏపీఐఐసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్చువల్ విధానంలో ఈ పరిశ్రమలకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం.

పారిశ్రామికవాడ అభివృద్ధికి చర్యలు



మడకశిర పారిశ్రామికవాడ అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకున్నాం. ఇప్పటికే మూడు పరిశ్రమలు ఏర్పాటుకు భూకేటాయింపు పూర్తయింది. వివిధ పరిశ్రమల ఏర్పాటుకు పలువురు పారిశ్రామిక వేత్తలు సంప్రదిస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు మడకశిర పారిశ్రామికవాడ చాలా అనుకూలంగా ఉంది. ఔత్సాహికులు ముందుకు వస్తే వారికి ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.
– సోని, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం



మడకశిర ప్రాంత నిరుద్యోగులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోకుండా పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఔత్సాహికులకు భూ కేటాయింపుల ప్రక్రియ పూర్తయింది. త్వరలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా వీటి నిర్మాణాలకు శంకుస్థాపన చేయించనున్నాం.
– తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

అదృష్టంగా భావిస్తున్నా



ఎంటెక్ పూర్తి చేసినా ఇప్పటి వరకూ సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కలేదు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం మడకశిరలోనే పరిశ్రమల ఏర్పాటుకు చొరవ తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. స్థానికంగానే ఉపాధి దొరికితే ఈ ప్రాంత నిరుద్యోగుల జీవితాలు మారిపోతాయి.
– కృష్ణాయాదవ్, ఆర్.గొల్లహట్టి, రొళ్ల మండలం

రుణపడి ఉంటాం



మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటుకు చొరవ తీసుకున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఉపాధి అవకాశాలు లేక ఇంత కాలం చాలా ఇబ్బందులు పడ్డాం. పరిశ్రమలు ఏర్పాటైతే మాకు ఇక్కడే పని దొరుకుతుంది.
– మల్లేష్, హనుమంతనపల్లి, రొళ్ల మండలం

క్లుప్తంగా

రంగస్థల నటుడు కేసీ కృష్ణ మృతి


కేసీ కృష్ణ (ఫైల్)

అనంతపురం కల్చరల్: రంగస్థల ప్రముఖ సీనియర్ నటుడు, లలిత కళాపరిషత్ పాలక మండలి ఉపాధ్యక్షుడు కేసీ కృష్ణ (87) సోమవారం కన్నుమూశారు. పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాల్లో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను మైమరపించే నటనతో మన్ననలు అందుకున్న ఆయన దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నాటకాలను ప్రదర్శించారు. జానపద గాయకుడిగా సందేశాత్మక నాటకాల్లో నటించిన కేసీ కృష్ణ తొలిరోజుల్లో స్త్రీ వేషంతో ఆకట్టుకునేవారు. వసంతకుడి పాత్ర ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెట్టింది. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం మృతి చెందిన తన భార్య నాగరత్నమ్మ పేరుతో కళాకారులకు అవార్డులందిస్తూ వచ్చారు. వయోభారంతో కన్నుమూసిన కేసీ కృష్ణ భౌతిక కాయానికి ఎల్‌కేపీ అధ్యక్షకార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ, పలువురు కళాకారులు ఘనంగా నివాళులర్పించారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు గ్రామ సమీపంలో ఉన్న చెరువులో గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన కొందరు స్థానికులు చెరువులోని నీటి గుంతలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. మృతదేహంపై రక్తగాయాలు ఉండడంతో హత్య చేసి కుంటలో పడేసి ఉంటారనే అనుమానాలూ వ్యక్తమయ్యాయి. వ్యక్తి అదృశ్యమైన ఘటనలకు సంబంధించిన కుటుంబసభ్యులు ఎవరైనా సోమందేపల్లి పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్ కోరారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ చాంపియన్‌గా 'అనంత'



చాంపియన్ ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

హిందూపురం టౌన్: కర్నూలులోని ఆదర్శ పాఠశాల వేదికగా రెండు రోజులుగా జరిగిన 9వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా క్రీడాకారులు చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ పోటీలు సోమవారం ముగిసాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా బాలికల జట్టు ఫైనల్‌లో కర్నూలు జట్టుతో తలపడి 10 – 5 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. జట్టు విజయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లోహిత, సాయి మనీషా, ప్రియమణితో పాటు కోచ్ రూపవతిని ఆ క్రీడా విభాగం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ప్రవీణ్‌రెడ్డి, యాసిన్ మాలిక్, రగ్బీ సంఘం సభ్యులు ఈశ్వర రెడ్డి, విష్ణు, మల్లికార్జున, ముస్తఫీమ్ అభినందించారు. ఇదే పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచింది.

వీఆర్‌ఏ బలవన్మరణం

విడపనకల్లు: కుటుంబ కలహాలతో విసుగు చెందిన ఓ గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్‌ఏ) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామానికి చెందిన బోయ గోపి (39)కి భార్య తలారి సునీత, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీఆర్‌ఏగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడు నెలల క్రితం కుటుంబ కలహాలు చోటు చేసుకోవడంతో అప్పట్లోనే భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమెను కాపురానికి పిలుచుకు వచ్చేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన గోపి... సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

- డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్


గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ఉద్యోగులతో డీఆర్‌ఎం ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే చక్కటి ఆరోగ్యం ప్రాప్తిస్తుందన్నారు. అనంతరం డీఆర్‌ఎం, ఇతర అధికారులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. అలాగే రైల్వే డివిజన్ ఆస్పత్రిలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఆర్‌ఎం ప్రారంభించి, పలువురు రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఆస్పత్రి సీఎంఎస్ గజలక్ష్మి పాల్గొన్నారు. అంతకు ముందు ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని డీఆర్‌ఎం ప్రారంభించారు. స్థానిక రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ రైల్వే కాలనీతో పాటు ప్రధాన రహదారి మీదుగా సాగింది. డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్, ఆర్పీఎఫ్ డివిజనల్ కమిషనర్ మురళీకృష్ణ, సీఐ బెనయ్య తదితరులు సైకిల్ తొక్కుతూ ముందు వరుసలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ, సీనియర్ డీసీఎం మనోజ్, డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, ఎస్‌ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం..

జాతిపిత మహాత్మ గాంధీ జీవితం అనుసరణీయమని జీఆర్పీ ఎస్పీ కె.చౌడేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక జీఆర్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహనీయుల బాటలో నడుద్దాం


మడకశిర సర్కిల్ స్టేషన్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి


ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ మహనీయుల బాటలో నడుస్తూ వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ విష్ణు పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిలను పురస్కరించుకుని సోమవారం ఎస్పీ మాధవరెడ్డి మడకశిర సర్కిల్ స్టేషన్‌లో, అడిషనల్ ఎస్పీ విష్ణు ఎస్పీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలో రోజురోజుకూ హింస పెరిగిపోతోందన్నారు. యువత హింసను విడనాడాలని, గాంధీ చూపించిన అహింస, సత్యం వంటి మార్గాల వైపు నడవాలని సూచించారు. అలాగే నిస్వార్థ సేవలతో తాను అలంకరించిన పదవులకే లాల్ బహదూర్ శాస్త్రి వన్నె తెచ్చారని కొనియాడారు. ఆ మహనీయులను స్మరించుకుంటూ వారి బాటలో నడుద్దామని పిలుపునిచ్చారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు రాజశేఖర్‌రెడ్డి, టైటాస్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

రాప్తాడు: పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం ఎం.చెర్లోపల్లికి చెందిన శీనప్ప, మంజుల దంపతుల కుమార్తె స్నేహలత (18) అనంతపురంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మార్చిలో జరిగిన పరీక్షల్లో ఆమె ఫెయిల్ అయింది. దీంతో సప్లి పరీక్షలు రాసింది. అయినా ఇందులోనూ ఆమె ఉత్తీర్ణత సాధించలేకపోయింది. తన స్నేహితులందరూ ఉత్తీర్ణులై ఉన్నత చదువులకు సిద్ధమవుతుండగా తానొక్కతే వెనుకబడడంపై తీవ్ర మనస్తాపం చెందిన ఆమె కొన్ని రోజులుగా ముభావంగా ఉంటూ వస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అమ్మా... నన్ను క్షమించు!

- రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య
- మొలల నొప్పి భరించలేక చనిపోతున్నట్లు తల్లికి లేఖ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ నాగప్ప

గుత్తి: 'అమ్మా... నన్ను క్షమించు. నా ఆరోగ్యం బాగోలేదు. అందుకే చచ్చిపోవాలనుకున్నాను. నాకు మొలల నొప్పి ఎక్కువగా ఉంది. భరించలేకున్నా. అందుకే చనిపోవాలని అనుకున్నా. నీవు అమ్ములు దగ్గరకు పోయి ఉండు. అమ్ములూ అమ్మ జాగ్రత్త. నువ్వు పిల్లలు జాగ్రత్త. నన్ను క్షమించండి.' అంటూ తన తల్లికి లేఖ రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హృదయ విదారకమైన ఈ ఘటన గుత్తిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు... గుత్తిలోని కటికి వీధికి చెందిన కేఎం కిరణ్‌కుమార్ (42) కొంత కాలంగా మొలల సమస్యతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. నొప్పి తీవ్రత భరించలేక జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన.. సోమవారం తన తల్లికి లేఖ రాసి గుత్తి జీఆర్పీ పరిధిలోని తురకపల్లి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైలు వేళల్లో మార్పులు

హిందూపురం అర్బన్: రైల్వే శాఖ ఏటా అక్టోబర్ 1న తేదీ నుంచి వేళల్లో మార్పులు చేస్తుంది. అందులో భాగంగా రైళ్ల రాక పోకల వేళలు మార్చినట్లు సౌత్ వెస్ట్రన్ రైల్వే అధికారులు తెలిపారు.



బెంగళూరు నుంచి ధర్మవరం వైపు వెళ్లు రైళ్లు.. హిందూపురం స్టేషన్ చేరే సమయం ఇలా ..

రైలు నంబర్	ఎక్కడినుంచి	ఎక్కడికి	రాక	పోక	ఎప్పుడు
12786	మైసూర్	కాచిగూడ	20.17	20.18	రోజూ
16532	బెంగళూరు సిటీ	అజ్మీర్	18.44	18.45	శుక్రవారం
06515	బెంగళూరు సిటీ	ఎస్ఎస్‌పీ నిలయం	09.41	09.43	రోజూ
06595	బెంగళూరుసిటీ	ధర్మవరం	10.32	10.34	రోజూ
18464	బెంగళూరు సిటీ	భువనేశ్వర్	15.32	15.33	రోజూ
16534	బెంగళూరు సిటీ	జోద్‌పూర్	18.44	18.45	ఆదివారం
17604	యలహంక	కాచిగూడ	17.32	17.33	రోజూ
12736	యశ్వంతపూర్	సికింద్రాబాద్	17.39	17.40	సోమ, గురు, శని
22601	చెన్నయ్	షిరిడీ	17.39	17.40	బుధవారం
11014	కోయంబత్తూర్	ఎల్‌టీ టెర్మినల్	17.59	18.00	రోజూ
17307	మైసూర్	బాగల్‌కోట	18.33	18.35	రోజూ
12627	యశ్వంతపూర్	న్యూఢిల్లీ	21.06	21.08	రోజూ
19567	ట్యూటికోరన్	ఓహా	12.54	12.55	సోమవారం
12975	మైసూర్	జైపూర్	14.59	15.00	గురు, శనివారం
19302	యశ్వంతపూర్	అంబేద్కర్ నగర్	17.17	17.18	గురువారం
12592	యశ్వంతపూర్	గోరక్‌పూర్	1844	18.45	సోమవారం
16571	యశ్వంతపూర్	బీదర్	20.7	20.48	బుధ, శని మినహా
22884	యశ్వంతపూర్	పూరీ	00.04	00.05	శని
16583	యశ్వంతపూర్	లాతూర్	20.47	20.48	బుధ, శుక్ర, శని
16592	మైసూర్	హుబ్లీ	23.39	23.40	రోజూ
12647	కోయంబత్తూర్	నిజాముద్దీన్	00.52	00.53	సోమ
22534	యశ్వంతపూర్	గోరక్‌పూర్	01.02	01.03	బుధ
16593	బెంగళూరు	నాందేడ్	01.24	01.25	ప్రతి రోజు
22683	యశ్వంతపూర్	లక్నో	01.02	01.03	గురు
22690	బెంగళూరు	అహమ్మదాబాద్	17.44	17.45	ఆదివారం

బెంగళూరు సిటీ వైపు వెళ్లు రైళ్లు

రైలు నంబర్	ఎక్కడినుంచి	ఎక్కడికి	రాక	పోక	ఎప్పుడు
22602	సాయినగర్‌షిర్డీ	చెన్నయ్	01.04	01.05	శనివారం
11301	ముబాయ్	బెంగళూరు సిటీ	02.22	02.24	రోజూ
16591	హుబ్లీ	మైసూర్	03.07	03.08	రోజూ
17308	బాగల్‌కోట్	మైసూర్	05.39	05.40	రోజూ
12735	సికింద్రాబాద్	యశ్వంతపూర్	06.04	06.5	సోమ, గురు, శని
17211	మచిలీపట్నం	యశ్వంతపూర్	06.58	07.00	మంగళ, గురు, శని
17603	కాచిగూడ	యలహంక	07.34	07.35	రోజూ
18463	భువనేశ్వర్	బెంగళూరుసిటీ	08.34	08.36	రోజూ
12785	కాచిగూడ	మైసూర్	03.31	03.33	రోజూ
06596	ధర్మవరం	బెంగళూరు సిటీ	14.32	14.34	రోజూ
06266	హిందూపురం	బెంగళూరు	..	06.30	రోజూ
16570	కాచిగూడ	యశ్వంతపూర్	00.44	00.45	ఆదివారం
22689	అహ్మదాబాద్	బెంగళూరు సిటీ	00.44	0045	గురువారం
22684	లక్నో	యశ్వంతపూర్	11.03	11.05	శనివారం
12194	జబల్‌పూర్	యశ్వంతపూర్	11.03	11.05	ఆదివారం
19568	ఓకా	టుటికోరన్	10.48	10.50	శనివారం
07693	గుంతకల్లు	హిందూపురం	21.00	..	రోజూ
12648	నిజాముద్దీన్	కోయంబత్తూర్	19.38	19.40	గురువారం
22883	పూరీ	యశ్వంతపూర్	16.04	16.05	శనివారం
16613	రాజ్‌కోట్	కోయంబత్తూరు	10.49	10.50	సోమవారం
16331	ముంబయ్	త్రివేండ్రం	13.54	13.55	సోమవారం
16594	నాందేడ్	బెంగళూరు సిటీ	01.14	01.15	రోజూ

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

JCB WALK-IN INTERVIEW GOLDFIELDS
STORE INCHARGE to work at Ananthapur with a qualification of Degree having experience in Automobile stores segment with Computer skills and soft skills will be preferred.
CASHIER work at Ananthapur Branch any graduation with similar experience such as cas and bank transactions
SERVICE ENGINEERS (HL & BHL) (MALE) Wanted Service Engineers to work at for Ananthapur and Sri Satya Sai Districts having qualification of DME / Diploma / ITI with minimum 2 to 3 years service experience in Construction Equipment / Automobile / Commercial Vehicle Service
Salary is not constraint for the right candidates
INTERVIEW DATES: 03-10-2023 to 07-10-2023, TIMING: 10:00 am to 5:00 pm
VENUE M/s GOLD FIELDS
Beside Andhra Jyothi Press, NH-44, Bypass Road, ANANTHAPUR - 515004
PH.No: 98484 97388 & 95530 73131,
EMAIL-ID:- goldfieldshr@gmail.com & mshafiulaa@goldfieldsjcb.in

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
NURSING ADMISSIONS
■ ఇంటర్ పాస్ అయిన స్టూడెంట్స్ కి B.Sc (నర్సింగ్) B.Sc. (MLT), BPT (ఫిజియోథెరపీ) GNM (నర్సింగ్), ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీలో హాస్టల్ కలదు. సంప్ర: జి. మురళి, సెల్ : 9030661651, ATP. [A-2736]

REAL ESTATE
షాప్స్ అమ్మబడును
■ ATP, KLD రోడ్‌లో ఉన్న పొంద ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు వందన శారీస్ & కిడ్స్‌వేర్ షాప్ అమ్మబడును. సెల్ : 9030309695, 9866012861. [A-776900]

TOLET
■ డబుల్ బెడ్ రూం, కిచెన్, హాల్, మంచినీటి సౌకర్యం కలదు. KLD రోడ్డు, డా॥ రజాక్ క్లినిక్ ప్రక్కన, నివాసమునకు / ఆఫీస్‌లకు గానీ ఇవ్వబడును బాడుగ : రూ. 9 వేలు మాత్రమే. 9951626131. [A-776903]

SERVICES
GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2416]

వధువు కావలెను
■ కమ్మ, డైవర్సీ, 42 సం॥ / 5.10" / B.Sc., / 40K PM / సొంత ఇల్లు / ల్యాండ్ ఉన్న వరునికి తగిన వధువు కావలెను. నోబ్రోకర్స్, డైరెక్ట్ వాట్సాప్ : 9618793700. [A-776904]

WANTED
■ జాబ్ గ్యారెంటీ మహిళలకు మా కంపెనీలో ఉచిత రూం+భోజనం ఇచ్చి జాబ్ ఇవ్వబడును. జీతం: 20,000/- వరకు ఏజెంట్స్ (1 మనిషికి: 5000/- కమీషన్) Ph: 9966310431 [H-793357]
■ రెయిన్‌బో కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు కావలెను. 10th, ఇంటర్, పాస్/ఫెయిల్ కమీషన్ ఇవ్వబడును, 2 వీలర్ కంపల్సరీ, ఫోన్ : 9398981980. [H-793454]

■ అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఉన్న ఎడ్యుకేషనల్ సర్వీస్ Officeలో టెలికాలర్స్‌గా Work చేయడానికి Females కావలెను సంప్ర॥ సెల్ : 8977502169. [A-2738]
■ Jobs : చదవడానికి గాని / ఏదైనా ప్రైవేట్ జాబ్స్ చేయడానికి గాని, స్టూడెంట్స్‌ని Refer చేయాలి. మంచి కమీషన్ ఇవ్వబడును. సంప్ర : 9030661651, అనంతపురము. [A-2737]
■ అనంతపురము అమెజాన్‌లో పనిచేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. 15,000 జీతం + ఇన్సెంటీవ్ ఇవ్వబడును. డ్రైవింగ్ లైసెన్స్, టూవీలర్, Android Mobile ఉండవలెను. సెల్ : 9059535594, 9959873633. [A-1214]
■ శివరామ లాడ్జి, శ్రీకంఠం సర్కిల్, అనంతపురము నందు మేనేజర్‌గా పనిచేయుటకు Female కావలెను. ఏదైన డిగ్రీ. మంచి జీతం. సెల్ : 9704727122. [A-1215]
■ హాస్పిటల్ నందు పనిచేయుటకు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, O.T. టెక్నీషియన్, ఆయాలు, ఆఫీస్ బాయ్స్, రిసెప్షనిస్టులు కావలెను. సంప్ర : 9182968880. [A-776902]
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221757]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.